# కల్తీ

ఇచ్ఛాపురపు రామచంద్రం

నేడో రేపో కూలిపోదు కదా అనిపించే ఆ పాతబడిన మేడమీది మూల గదిలో ఓ మూలగా ఊగిసలాడుతున్న ముక్కాలి పీట మీద కూర్చుని, కిటికీ ఊచలలోంచి ఆకాశపు ముక్కలని చూస్తూ రెండు చేతులతోనూ తల పట్టుకుని అత నేమని గొణుక్కుంటున్నాడో మీకు వినిపించిందా?

"ఎలా చావడం?" అని.

విచిత్ర మేమిటంటే సుమారు రెండు సంవత్సరాల క్రితం అత నీ గదిలో అద్దెకు దిగిన తొలి సాయంత్రమూ ఇలాగే ఈ బల్లమీదే, ఈ కిటికీవారనే కూర్చుని ఆకాశం వైపు చూస్తూ అప్పుడూ గొణుక్కున్నాడు. ఏమని?

"ఎలా బతకడం?" అని.

ఈ రెండు నిట్టూర్పులూ లేదా గొణుగుళ్ళకీ మధ్య తక్కువ కథేమీ జరగలేదు.

అతని పేరు గోపాలం. ఈ గదిలో దిగేనాటికి అంటే సుమారు రెండేళ్ళ కిందట గోపాల మంటే లక్షలాది విద్యావంతులయిన నిరుద్యోగులలో ఒకడు. బ్రతుకు తెరువు వెదుక్కుంటూ బెడ్డింగు భుజాన వేసుకుని నగరానికి వచ్చిన ఏకాకి. ఇప్పటిలా ఎలా చావాలా అని కాక ఎలా బతకాలా అని బెంగపెట్టుకున్న యువకుడు. అప్పటికీ, ఇప్పటికీ అత నటూ ఇటూ ఎవరూ లేని ఒంటరివాడే.

నమ్ముకుని వచ్చా డనేమో నగరం అతని మీద జాలి పడింది. అతి చవకగా ఈ మేడమీది మూల గదిని అద్దెకు చూపింది. అతనితోపాటు ఎండా వానా, వెలుగూ చీకటి సహజీవనం చేస్తే వేరేమాట. అది - గది. గది గదే కదా! నాలుగు గోడలు ఉన్నాయి కదా! అతని సర్వస్వమూ అయిన పట్టా, రెండు మూడు జతలు పెట్టుకున్న పెట్టె ఉంచుకుందు కా మాత్రం గది చాలదూ? కావాలంటే కాళ్ళు ముడుచుకు విశ్రమించవచ్చు. లేదూ, ఆ ముక్కాలి పీట మీద ఒళ్ళు దగ్గరపెట్టుకుని కూర్చోనూవచ్చు. అన్నట్లా గదికి కిటికీ కూడా ఉంది. దానిలోంచి అప్పు డప్పుడు గాలీ, వెలుగూ వచ్చే సదుపాయంతోపాటు ఎప్పుడూ ఆకాశం కనిపించే అతి విలువైన అదృష్ట ముంది. ఒంటరీ, నిరుద్యోగీ అయిన వాడికి కిటికీలోంచి ఆకాశం చూస్తూ నిట్టూర్చుకుందుకు సౌకర్య మంటే తక్కువ అదృష్టం కాదు కదా? అందులోనూ గోపాలంలాటి మనిషికి!

పాత కాలపు ప్రమాణాల దృష్ట్యా అయితే గోపాలం మామూలు మనిషి. ఈ రోజులబట్టి అయితే మాత్రం వింత మనిషీ, విచిత్ర వ్యక్తీ. ఈ కాలం మనుషుల కత నలా అనిపించడంలో వింతా లేదు, విచిత్రమూ లేదు. ఎందుకంటే - గోపాలానికి సత్య మన్నా స్వచ్ఛతన్నా ప్రాణం. నీ తి అంటే ఇష్టం. రాజమార్గమే అతని ఆదర్శం.

అంతమేరకే అయితే కొంత నయం. అతనికి కల్మషమన్నా కాలుష్యమన్నా అవినీ తన్నా అక్రమమన్నా అయిష్టమూ, అసహనమూ. జీవితం తేట నీరులా ఉండాలి తప్ప బురద నీరులా ఉండకూడ దనుకుంటాడు. అనుకుని ఊరుకుంటే బాగుండును ఏ ఆపదా లేకుండా. తన ఇష్టాలూ, అయిష్టాలూ, ఊహలూ, సిద్ధాంతాలూ, ఆదర్శాలూ అన్నిటినీ ఆచరణలోకి తేవాలని కంకణం కట్టుకున్నా డమాయకంగా, సామాన్యుల భావనలో - అదే అతను చేసిన పొరపాటు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిలో పేరు నమోదు చేయించాడు పద్ధతి ప్రకారము పట్టభద్రు డయ్యాక. అంతే తప్ప కాల్ లెటర్ పంపేందుకు ఆ అధికార్లకు కాను లందించ లేదు. పైగా అది వారి విధి అన్నాడు.

పేపర్లో ప్రకటన పడితే దరఖాస్తు పెట్టడమే తప్ప లంచమూ, సిఫార్సులతో ఉద్యోగాన్ని వేటాడ లేదు.

ఒకరి కాళ్ళు పట్టుకోనూ లేదు, మరొకరి చేతులు తడపనూ లేదు.

మ రెలా వస్తుంది ఉద్యోగం ఈ రోజుల్లో? పైగా శ్రేయోభిలాషులు సలహా ఇవ్వబోతే - "అలాటి అడ్డదార్లు తొక్కను గాక తొక్కను. అవినీతీ, అక్రమమూ, లంచగొండితనమూ అంటే నా కసహ్యం" అని వారి ముఖంమీదే చెప్పేశాడు నిర్మొహమాటంగా.

మొదటి నుంచి అంతే అతను. పరీక్ష హాలులో విద్యార్థులదే పైచేయి అయి, అందరూ స్లిప్పులు తెచ్చి రాసుకుంటుంటే గోపాలం మాత్రం తనకి వచ్చిం దేదో రాశాడు బుద్ధిగా. పక్కదార్లు తొక్కిన వాళ్ళకి ఫస్టుక్లాసు లొస్తే అతనికి సెకండ్ క్లాస్ మాత్రమే వచ్చింది. అందు కతను చింతించలేదు సరికదా అదే పది వే లనుకుని సంబరపడ్డాడు.

అతను ఒంటరివాడు. అతని మీద ఆధారపడిన వా ళ్ళంటూ ఎవరూ లేరు. కనుక అతని పిచ్చి లేదా వెర్రికి అత నొక్కడు మాత్రమే బలి అవుతుండేవాడు. చివర కతను నగరం చేరుకున్నాడు.

ఇవి ఎంతమాత్రమూ మడి రోజులు కావు. ఒట్టి తడిరోజులు మాత్రమే. అందుచేత నగరంలోనూ అతని అర్హతకు తగిన ఉద్యోగం లభించలేదు. అస లే ఉద్యోగమూ లభించలేదు ఓ వారం వరకూ. ఇక అతనూ, అతని ఆశయాలూ ఆకలి కెండిపోవలసిందే కాని - ఏ మూలో కాస్త హృదయం మిగిలిపోయిన మహాపట్నం అతను చావకుండా బతకడానికి, రోజులు వెళ్ళదీయడానికి, రేపటి కోసం ఎదురు చూడటానికి కొన్ని తోవలు చూపించింది.

గోపాలం పోస్టాఫీసుల దగ్గర ఉత్తరాలు రాసిపెట్టసాగాడు.

ఓ ప్లీడరు దగ్గర రోజూ గంటో, రెండు గంటలో టైపు పని చేసేవాడు.

స్పీడ్ పోస్ట్ కార్యాలయంలో సహాయపడేవాడు.

తీరిక వేళల్లో గ్రంథాలయానికి వెళ్ళి వార్తా పత్రిక చూడడమూ, వాంటెడ్ కాలమ్స్‌లో తగిన ఉద్యోగం తగిలితే దరఖాస్తు పడెయ్యడమూ.

ఆదాయం ఎక్కువ కాకపోయినా ఆహారానికి లో టుండడం లే దిప్పు డతనికి.

ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూనే ఉన్నాడు.

నిజానికి నగరంలో జీవించడమూ, చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ప్రపంచ సరళినీ, జీవన విధానాన్నీ గమనించడమూ - ఈ అనుభవాల వలన అయినా అతను తన సిద్ధాంతాలూ విశ్వాసాలలోని కాలం చెల్లినతనాన్ని గ్రహించుకోవలసింది. కానీ అవన్నీ అతని పట్ల దున్నపోతు మీద జడివాన చందమే అయ్యాయి. అంతే కాదు, తన నమ్మకాలకు విరుద్ధమైన వాస్తవా లెదురవుతున్న కొద్దీ, గోపాలంలోని వేపకాయంత వెర్రి కాస్తా వెలగకాయ ప్రమాణానికి పెరగసాగింది. ప్రపంచంలోని వక్రత అవగత మవుతున్న కొద్దీ అతని వెర్రి ముదిరి పిచ్చి కాసాగింది. స్వచ్ఛత కోసమూ, సరళత కోసమూ అతను మరింత అంగలార్చడం మొదలుపెట్టాడు. విష్ణుమూర్తి మీద హిరణ్యకశిపుడిలా కాలుష్యం మీదా, కల్తీ మీదా కత్తి దూయసాగాడు.

ఎక్కడైనా ఏ పెళ్ళికో మైకు పెట్టి ఆ శబ్దం అతని చెవినపడితే చాలు రివ్వున అక్కడికి దూసుకుపోయి -

"చూడండి! ఎవరి వెర్రి వాళ్ళ కానందం. అలాగే ఎవరి పెళ్ళి వారి కానందం. తప్పు లేదు. కాని మీ రిలా మైకులు పెట్టి ఊరూ, వాడా చావబాదడం మాత్రం సమంజసమూ కాదు, క్షమార్హమైన నేరమూ కాదు. సహజీవన సిద్ధాంతానికీ, సభ్యతా సంస్కారాలకీ, ప్రశాంతతకీ గొడ్డలిపెట్టు. మీ చుట్టుపక్కల చదువుకునే విద్యార్థులు, నిద్రపోవలసిన పసిపాపలు, ఆరోగ్యం సరిగా లేని వృద్ధులు, పనిపాట్లు చేసుకోవలసినవారు ఎందరో ఉంటారు. వాళ్ళందరికీ మీ మైకుల రొద ఎంత ఇబ్బంది కలిగిస్తుందో ఆలోచించారా? మీ ఆనందం కోసం

వాళ్ళందరినీ బాధించే అధికారం మీ కెక్కడిది? ఊళ్ళో పెళ్ళి కుక్కలకి హడావుడీ అన్నట్లు పెళ్ళి మీదీ, శిరోవేదన వాళ్ళకీనా! మీరు మరొక అంశం కూడా గుర్తించాలి. హద్దు మీరిన శబ్దం వాతావరణాన్ని కలుషితం చేసి వదులుతుంది. ఇది సాంఘిక ద్రోహమే. గంటల తరబడీ, రోజుల తరబడీ పగలూ, రాత్రీ అనకుండా వేళాపాళా లేకుండా మీరు మైకులతో ఊదరగొట్టేస్తుంటే మా అందరి బుర్రలూ పిచ్చెక్కిపోయి, మైకు పాటల తలనొప్పి భరించలేక మీ పెళ్ళి మా శ్రాద్ధంలా ఉందని తిట్టుకుంటాం కూడా. ఇది మీకు మంగళం కాదు. కనుక వెంటనే మైకులు కట్టేసి అవతల పారేయండి వాతావరణా న్నింకా కలుషితం గావించకుండా" అని ఉపన్యాసామిస్తాడు పెళ్ళివారికి. అక్కడితో ఆగకుండా - "న్యాయంగా అయితే మీరు చేస్తున్న పనికి పబ్లిక్ న్యూసెన్స్ కేసుపెట్టి, పోలీస్ రిపోర్టివ్వాలి" అని కూడా హెచ్చరిస్తాడు.

తరువా తేం జరుగుతుందో వేరే చెప్పాలా? ఎవరో పిచ్చివా డని నలుగురూ కలసి గోపాలాన్ని మెడ పట్టుకుని అవతలకు తోసేస్తారు. అయినా అతను మారడు. ఎన్ని అనుభవాలైనా ఎప్పటి కప్పుడు వరగడుపే. కల్తీనీ, కాలుష్యాన్నీ అతనెంత మాత్రమూ భరించలేడు మరి.

ఆ వేళ గాజు గ్లాసులో మంచినీళ్ళు తాగుతూ గ్లాసు వైపు చూసి ఒక్కసారి నీళ్ళు తాగడం ఆపేసి, ఆ గ్లాసు పట్టుకుని సరాసరి నగర పాలక సంస్థ కార్యాలయం చేరుకుని వైద్య శాఖాధికారి ముందు ఆ గ్లాసు ఉంచి - "ఏమిటిది? ఈ నీళ్ళు మనుషులు తాగడానికేనా?" అని అడిగాడు సూటిగా.

ఒక్క క్షణం ఆ అధికారి బిత్తరపోయాడు. అంతలోనే తేరుకుని, గోపాలాన్నీ అతని వాలకాన్నీ చూసి అతి తేలికగానూ, వ్యంగ్యంగానూ - "మనుషులు తాగడాని కని ఎవ రన్నారు? నీలాటివాళ్ళు తాగడానికే ఇలాటి నీళ్ళు. గెటౌట్!" అని బంట్రోతును పిలిచి బయటకు గెంటించాడు.

నీటి కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులూ, వాటి మీద గోపాలం చెపుతున్న ఉపన్యాసాన్ని అధికారే కాదు, అతని బంట్రోతు కూడా వినలేదు. అయినా అతని ఆలోచనా ధోరణిలో మార్పు రాదు.

అన్నంలో రాయి వస్తే - ఈ దేశంలో అంతా కల్తీయే. బియ్యంలో కలిపే రాళ్ళని తయారు చేసే యంత్రాలకు అనుమతిస్తుం దట ప్రభుత్వం! ఇంతకంటె దారుణ మిం కేముంటుంది? అన లీ ప్రభుత్వాన్ని శిక్షించాలి ముందు అని స్వగతంలో అనుకుంటాడు ఎదురుగా ఎవరూ లేకపోతే, సాంబారు పలచగా ఉంటే, నీటితో కల్తీ చేసేశాడు హొటలు వా డని ఎగిరిపడతాడు.

చివరకు నిద్రతో కూడా రాజీ పడలేకపోతున్నాడు గోపాలం.

నిద్రపోతుంటే దోమ లేదా నల్లి కుట్టి తెలివొచ్చినా, కల వచ్చి మెలకువైనా, కలత నిద్ర కల్తీ నిద్ర ఎంత దౌర్భాగ్యం! చివరకి నిద్ర కూడా కల్తీయే.




స్వచ్ఛంగా నిద్రపోయేందుకు కూడా లేదు అని తిట్టుకుంటాడు.

కల్తీ, కాలుష్యం, అవినీతి, లంచగొండితనం, అక్రమాల నరికట్టడం గోపాలం ఆదర్శం కదా అని అతడిని రక్తమాంసాలు లేని నవలా నాయకుడిలా కాగితంపులో సినిమా హీరోలా తెర వీరు డనో అనుకుంటే పొరపాటే. ఈ ఆదర్శాల సంగతి అటుంచితే గోపాలమూ అందరిలాటి వాడే. అతనికీ సిద్ధాంతాలతోపాటు రక్త మాంసాలూ, మనసూ మొదలైనవి ఉన్నాయి.

యౌవనం వచ్చే వరకూ పె ళ్ళవకపోతే ఎవరైనా సరే ప్రేమలో పడి తీరతా రని ఓ రచయిత ఉవాచ. దానిలో చాలావరకూ నిజమే ఉండి ఉండవచ్చు.

గోపాలం పోస్టాఫీసు దగ్గర ఉత్తరాలు రాసీ రాసీ అలసిపోయి, టీ తాగుదా మని రోడ్డు పక్క స్టాలు వద్దకు వచ్చాడు. అప్పుడే ఆమె కూడా అక్కడి కొచ్చింది. టీల మీద వాళ్ళ పరిచయం అయింది. పాత హిందీ సినిమాలోలా ఆ చిన్న పరిచయం మరో వారం తరువాత బీచిలో పల్లీల మీద ప్రేమగా మారింది. పల్లీలూ, కబుర్లూ తింటూనే ఇద్దరూ 'ఐ లవ్ యు' అంటే 'ఐ లవ్ యు' అనుకున్నారు. అక్కడి నుంచి ప్రేమ మంచి ఎరువేసిన మొక్కలా, వయసొస్తున్న ఆడపిల్లలా త్వరత్వరగా ఎదిగిపోయింది. వా ళ్ళిద్దరూ ఊళ్ళోని పార్కులన్నీ తిరిగేశారు. సినిమాలు చూసేశారు. రోడ్లు కొలిచేశారు. అలా ఓ నెలా నెలన్నరలో వాళ్ళ ప్రేమ అత్యంతాభివృద్ధి చెందింది. పరాకాష్ఠ చేరింది.

ఆ అమ్మాయి రాధ స్నేహంలో గోపాలం చాలా ఆనందంగా ఉండేవాడు. అతను కల్తీ, అవినీతి వంటి విషయాలను తాత్కాలికంగా మరిచిపోయాడు. ఏ విధమైన కల్తీ, కల్మషమూ లేనిది ప్రేమ అని భావించుకునేవాడు. రాధలాటి అందమైన అమ్మాయి తనని ప్రేమించడంలోనే ప్రేమ ఎంత నిర్మలమో, నిస్వార్థమో తెలుస్తోంది కదా అనుకునేవాడు. ప్రేమ కల్మషరహితం కాకపోతే అందమైన రాధ తన లాటి సామాన్యుడ్నెందుకు ప్రేమిస్తుంది?

రాధా, గోపాలాల ప్రేమ పండి పెళ్ళయ్యేదే. కాని ఓ సైంధవు డడ్డువచ్చాడు. ఆ సైంధవు డెవరో కాదు. రాధని చూడడానికి వచ్చిన పెళ్ళి కొడుకు. ఆ పెళ్ళి చూపులు రాధా వాళ్ళ నాన్న గా రేర్పాటు చేశారు. ఆ విషయాన్ని రాధ రహస్యంగా ఉంచక, ముందే చెప్పడంతో తన ప్రేమ నిస్సందేహంగా నిర్మలమైం దని మరోసారి దృఢపరచుకున్నాడు

గోపాలం.

పెళ్ళి చూపులైన మర్నాడు గోపాలమూ, రాధా ఓ పార్కులో కలుసుకున్నారు ముందుగానే నిర్ణయించేసుకున్నట్లు. తను వచ్చేటప్పటికే అతను ఎదురు చూస్తూండడం గమనించి రాధ అడిగింది - "వచ్చి చాలా సేపయిందా? సారీ! నీకు బోరు కొట్టి ఉంటుంది."

"లేదు" అన్నా డతను జరిగింది జ్ఞాపకం వస్తూంటే.

గోపాలం అక్కడికి వచ్చేసరి కెవరో సిగరెట్ కాలుస్తూ నిలుచున్నా రక్కడ. అంతకంటే మంచి అవకాశం ఏమి టుంటుంది గోపాలం లాటి వాడికి?

"సిగరెట్ల వల్ల క్షయ, కాన్సరు వస్తుంది. ఆ పొగవల్ల వాతావరణం కలుషిత మవుతుంది. మీ కొకటి తెలుసో, లేదో. సిగరెట్ కాల్చే వారికంటే ఆ పొగ పీల్చే ఇతరులకే ఎక్కువ హానికరం. అందుచేత సిగరెట్లు మానెయ్యండి అర్జెంటుగా" అంటూ లంకించుకున్నాడు గోపాలం - రాధ ఇంకా రాలేదు కదాని.

, ఛాదస్తం... జిడ్డు... బంక... నుత్తి - లాటి పదాలతో మనసులో నాలుగు తిట్టుకుని అంతకీ కసితీరక... "చూడండి... సిగరెట్ పొగకంటే వాతావరణాన్ని మరింత ప్రమాదకరంగా కలుషితం చేసే దేమిటో తెలుసా? మీ ఉపన్యాసం లాటివే!" అనేసి పారిపోయా డతను.

అప్పటికి రాధ వచ్చింది.

గోపాలానికి ఆత్రంగా ఉంది, రాధ ఏం చెబుతుందో అని. కల్తీ కాకుండా మిగిలినది ప్రేమ ఒక్కటే ఏమో అనిపిస్తూంది. స్వచ్ఛమైన ప్రేమ తనకి దక్కితే ఆ అదృష్టం చాలు.

రాధ ఏమీ మాట్లాడకపోవడం చూసి తనే అడిగాడు - "పెళ్ళి కొడు కెలా ఉన్నాడు?"

"ఏదోలా ఉన్నాడు. ఫరవాలే దంతే. అసలు విషయం అది కాదు." •

"మరేమిటి?" ఆత్రంగా అడిగాడు.

"నాన్నగారి కతను చాలా నచ్చేశాడు. ఎందుకంటే - అతనికి స్థిరమైన ఉద్యోగం ఉంది. అతని వెనుక ఆస్తి ఉంది. బంధువులూ, బలగమూ ఉన్నారు..."

"అవన్నీ అలా ఉంచు. ను వ్వతన్ని ప్రేమిస్తున్నావా? అతన్ని పెళ్ళి చేసుకుందుకు సుముఖంగా ఉన్నావా? మన ప్రేమకంటే - మీ పెళ్ళే బాగుంటుం దనిపిస్తుందా?"

గుండెలు దడ దడ లాడుతున్నా ప్రశ్నల వరంపర కురిపించాడు ఆత్రంగా.

రాధ ఏమీ అనలేదు. ఒక్కసా రతని ముఖంలోకి చూసి - అంతలోనే తల వంచుకుంది తన ముఖం - ముఖ్యంగా - కళ్ళను అతని నుంచి దాచుకుంటూ.

ఒకటి... రెండు... మూడు నిముషాలు... మూడు యుగాలంత దీర్ఘంగా... భారంగా... మౌనంలోనూ, నిశ్శబ్దంలోనూ బహు బాధాకరంగా. ఆమె మౌ ,నం వదలలేదు. మాట్లాడలేదు. అంతే. అతను పగిలిపోతున్న హృదయంతో ఆమె ముందు నుంచి పారిపోయాడు. అతను తీవ్రమైన ఆశాభంగం చెందాడు. అతని సిద్ధాంతానికి, విశ్వాసానికీ, ఆశలకీ పెద్ద అఘాతం ఎదురైంది. నాగరిక జీవనంలో చివరకి ప్రేమ కూడా స్వచ్ఛంగా మిగలలేదు! వర్షపు చినుకుల్లా స్వచ్ఛంగా, సహజంగా ఉండవలసిన ప్రేమ కూడా వరద నీరులా బురద అయిపోయింది. కల్తీ అయిన ప్రేమ గోపాలానికి పడదు కదా? అతను ఒక్కసారి ఒంటరి అయిపోయాడు - ఆలోచనలలో కూడా. ఒంటరితనం కూడా విస్కీలాగే మోతాదు మీరితే మనిషికి కీడే. బాల్యంలో స్నేహితులూ, యౌవనంలో అర్ధాంగీ లేకపోతే ఎవరికైనా అవసవ్యమైన ఉద్దేశాలే కలుగుతుంటాయి. విపరీతపు టాలోచనలే వచ్చి పడతాయి.

గోపాలం - ఆత్మ పరిశీలన పేరుతో తనని తాను విమర్శించుకున్నాడు - రాధ దూరమైన వైరాగ్యంలో రెండో రోజయినా గడవకుండానే.

ఏమిటి తన జీవితం? లాయరు దగ్గర టైపు... పోస్టాఫీసుల్లో ఉత్తరాలు...

స్పీడ్ పోస్ట్ పట్టుకుని సైకిలు మీద పరుగులు... మధ్య మధ్య లైబ్రరీ... వాంటెడ్ కాలమ్స్... ఎందుకు బతకడం? అవును. పీల్చే గాలినుంచి... చూసే దృశ్యం నుంచి... ప్రేమించే ప్రేమవరకూ సర్వమూ కల్తీ మయమయిపోయిన ఈ ప్రపంచంలో ఎందుకూ బతకడం? ప్రతీదీ కల్తీయే. ఏదీ సత్యమూ కాదు, సహజమూ కాదు. సత్యం, శివం, సుందర మనేది తెలుసుకోలేనంతగా కల్మషమైపోయింది ప్రపంచం. అంతకీ తను ఈ లోకంలోని కల్తీతో కత్తి దూసి పోరాడుతూనే వచ్చా డిన్నాళ్ళూ. కాని... ఒక్కటంటే ఒక్క విషయంలో అయినా విజయం సాధించగలిగాడా? ఊహుఁ. ముచ్చటగా ఒక్కసారైనా కల్తీమీద గెలుపు తీసుకోలేకపోయాడు. రాధ ప్రేమ కూడా అలా కల్తీ అయిపోయాక ఇక తనకి - ఆశా మిగలలేదు; జీవితమూ మిగలలేదు. అపజయాలు అంతిమ విజయానికి సోపానాలన్న సూక్తిలో సత్యం కొంత ఉండవచ్చు కానీ, అదేపనిగా అన్నీ అపజయాలే ఎదురౌతుంటే ఎవరూ అంతిమ విజయంవరకూ పోరాటం సాగించలేరు సహజంగా.


తను పోరాడి నన్నాళ్ళు పోరాడాడు. చిత్తుగా ఓడిపోయాడు.

ఇక సాగడం తన తరం కాదు. రాధ ప్రేమా దక్కని తన కీ జీవితం అనవసరం.

తను చచ్చిపోవడమే సయం. జీవితాని కర్థమూ, ప్రయోజనమూ మిగలకపోయాక బతికి ఉం డేం లాభం?

గోపాలం - స్థిరంగా నిశ్చయించుకున్నా డాత్మహత్య చేసుకోవాలని.

ఆత్మహత్య చేసుకోవడం ఎలా అని తీవ్రంగా ఆలోచించాడు. అన్నిటిలోకీ సులభంగా ఉరేసుకోవడమే కనిపించింది. వెంటనే వెళ్ళి షాపు నుంచి తాడు కొనుక్కొచ్చాడు. రాధతో చూసిన సినిమాలో హీరోయిన్ ఉరి వేసుకున్న-సన్నివేశాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ - ఉరి వేసుకున్నాడు. అతడు బల్లని తన్ని - గాలిలో పది సెకండ్లు కూడా వేలాడనే లేదు - ధబ్ మంటూ కింద పడ్డాడు, ఠాప్ మంటూ తాడు తెగిపోగా. గోపాలానికి నడుమే బెణికింది తప్ప ప్రాణం పోలేదు. అతనికి ఒళ్ళు మండింది.



"వెధవ కల్తీ. చివరకి తాడుముక్కలో కూడా కక్కుర్తే. ప్రపంచంలో దేనినీ నమ్మడానికి లేకుండా పోతోంది" అని ప్రపంచాన్నీ కల్తీనీ తిట్టుకున్నాడు.

నడుము నొప్పి తగ్గాక - పురుగుల మందుల షాపుకి వెళ్ళి ఎండ్రిన్ తెచ్చుకున్నా డేదో సాకు చెప్పి. అది ఇస్తూ దుకాణదారు సవాలక్ష జాగ్రత్తలు చెప్పాడు - అంత విషం, ఇంత విషం అని భయపెట్టేశాడు.

భోజనం చేశాక ఆ సీసాడు మందునీ సేవించేసి - పడుకుని చచ్చిపోవా లనుకుంటూ మేను వాల్చేడు. కాలెండరుకి చివరి మాటలు చెప్పేశాడు. ప్రపంచానికి - తన మనసులోనే అంతిమ సందేశం ఇచ్చేశాడు - "కల్తీ, కల్మషం, మోసం, దగా, వంచన, కుట్రలు వదిలి స్వచ్ఛంగా సరళంగా సూటిగా సుందరంగా బతకడం నేర్చుకుని జీవన సౌందర్యం ఆస్వాదించ"మని. అప్పుడు కళ్ళు మూసుకున్నాడు - ఎక్కడినుంచో వినిపిస్తున్న పదకొండు గంటలనూ విని.

ఉదయం ఆరుకి టంచనుగా కళ్ళు తెరిచేసుకుంటే - "అయ్యో! నేను చచ్చిపోలేదా?" అంటూ ఆశ్చర్యంగానూ, అమిత దుఃఖంగానూ లేచి కూర్చుని - పురుగుల మందుని కల్తీ చేసిన వాళ్ళని తిట్టుకుంటూ కాలకృత్యాలకు పరుగెత్తాడు. అప్పుడే అతని కనిపించింది - "ఇలాగ - ప్రశాంతంగా - గదిలో హాయిగా చనిపోయే అదృష్టం తనకి లేదు. తిరుగులేని ఆత్మహత్యా ప్రయత్నం చేయవలసిందే."

అది ఎలాగని ఆలోచిస్తూ ఎక్కడికీ వెళ్ళకుండా గదిలోనే కూర్చున్నాడు. అతనికి మరొక చక్కని ఆలోచన వచ్చింది చచ్చిపోవడానికి. విజేతలా నవ్వుకున్నాడు. తన తెలివితేటలకి తానే అభినందించుకున్నాడు తనని.

అవును. కోడిగుడ్డు నింకా కల్తీ చెయ్యలేకపోతోందట ప్రపంచం. కోడిగుడ్డునే, కాదు, విద్యుచ్ఛక్తినీను!

అతను జాగ్రత్తగా తన గదిలోని స్విచ్ కాప్‌ను ఊడదీశాడు. కడుపు కోయగా పేగులు బయట పడ్డట్లు - తీగెలు బయటపడ్డాయి. అత నపరిమితా నందంతో ఆ తీగెలని పట్టుకున్నాడు క్షణంలో నగం. అతను వెనక్కి తూలి పడ్డాడు ఎవరో తోసినట్లు. ఆ పాటుకి మళ్ళీ నడుము నొప్పెట్టింది. ఆ షాక్‌కి అరచెయ్యి కొంచెం కాలింది. అంతే తప్ప అతను కోరుకున్నట్లు చావలేదు.

తలుపు తట్టిన శబ్దమైతే - స్విచ్ కాప్ బిగించేసి తలుపు తీశాడు. ఎదురుగా ఇంటి యజమాని!

"లో వోల్టేజి వస్తూందని కంప్లయిం టిచ్చాను. ఓ గంటలో కరెంటు వాళ్ళు వచ్చి బాగుచేస్తారు. ఆ విషయం చెప్పి పోదామని వచ్చాను. అవసరమైనంత వోల్టేజి రాకపోతే కష్టం కదా?"

"అవును. చాలా కష్టం. అవసరమైనంత ఓల్టేజి లేకపోతే మన ఆశలూ, అంచనాలూ -అన్నీ తారుమారై మనం ఓడిపోతాం."

అతన్ని పిచ్చివాడిని చూసినట్లు చూసి వెళ్ళిపోయాడు యజమాని త్వరత్వరగా. ఇంకా అక్కడుంటే ఏం పిచ్చి మాటలు వినవలసి వస్తుందో అని భయపడినట్లు.

ఆ తొందరలో అతను తను తెచ్చిన రైల్వే గైడు నక్కడ మరిచిపోయిన సంగతే గమనించలేదు.

యజమాని వెళ్ళడమేమిటి, తలు పేసుకుని మళ్ళీ తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు గోపాలం. ఎలా చావాలి? తిరుగులేకుండా ఎలా చావడం?

హఠాత్తుగా అతని దృష్టి రైల్వే గైడుమీద పడింది. దానిని చేతిలోకి తీసుకోవడమేమిటి అతని కొక అద్భుతమైన ఆలోచన వచ్చింది. గబగబా ఆ రైల్వే గైడ్ పేజీలు తిరగేశాడు.

మరొక అరగంటలో రై లుంది. రైలు కింద పడితే చావడం తథ్యం. తిరుగులేదు. కొంచెం సరిగానూ, జాగ్రత్తగానూ రైలు కింద తల పెడితే చావక తప్పదు.

గోపాలం బట్టలు వేసికుని రైలు పట్టాల వేపు నడిచాడు. అప్పటికి పదకొండు దాటిందేమో చాలా ఎండగా ఉంది. అతను ఎండని లెక్కచెయ్యకుండా... స్టేషన్‌కి దూరంగా... రైల్వే లైను కొంచెం నిర్జనంగా ఉండే చోటుకి నడిచాడు. రైలు మరో అయిదు నిముషాలలో వస్తుం దనేవరకూ గడియారం చూసుకుంటూ రైలు పట్టాల పక్క గడిపి... అప్పుడు వెళ్ళి పట్టాలమీద పడుకున్నాడు. ఒకటి రెండు రిహార్సల్స్ వేసుకున్నాక ఆత్మహత్యా భంగిమ సరిగా అమరిన ట్లనిపించింది. కాని, అలా పడుకోడం అతనికి చాలా బాధగా ఉంది. రైలు పట్టా ఇనపది వేడెక్కి ఉండడంతో అతని మెడ నొప్పెడుతూనూ, కాలిపోతూనూ ఉంది. కళ్ళు మూసుకుని ఎదురుచూడసాగాడు. క్షణం యుగంలా గడుస్తోం దతనికి.

ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము - అన్న పద్య పాదం గుర్తుకొస్తూంది గోపాలానికి. నిజమే. చావడం కూడా సులభం కాదు. అసలు బ్రతకడమే సులభమేమో చావడం కంటే అనిపిస్తూంది తన అనుభవాలని చూసుకుంటే.

ఎంతకీ రాదేం పాడు రైలు? తను పట్టాలమీద పడుకుని అయిదు నిముషాలు దాటిపోలేదూ! అయిదు నిముషాలేం కర్మ, ఇంకా చాలాసేపే అయి ఉంటుంది.


గోపాలానికి కొంచెం దగ్గరలోంచి ఎవరిదో కంఠం - "ఇక్క డెందుకు బాబూ! పట్టాలమీద పడక? రాస్తా రోకో జరుగుతున్నది అవతల స్టేషనులో. కావాలంటే అక్కడికి వెళ్ళి వాళ్ళతో పాటు నువ్వూ పడుకో! అంతేకాని, ఇక్కడ పట్టాలమీద పడుకుంటే రైలు రావాలా, చావాలా? ఏ సాయంత్రానికో, రాత్రికో కాని స్టేషను నుంచి రైళ్ళు వదలరు..."

నిస్పృహగా లేచిపోయాడు గోపాలం. ఏమిటీ? ఇవాళ రాస్తా రోకోనా! తనకి తెలియనే తెలియదే. రైళ్ళు రావని తెలియక అనవసరంగా శ్రమ పడ్డాను. దురదృష్టవంతుడు తల కడిగితే వడగళ్ళ వానని దీన్నే కాబో లంటారు. అయినా వినాయకుడి పెళ్ళికి వెయ్యి విఘ్నాలని తన ఆత్మహత్యా ప్రయత్నాల కీ ఆటంకాల పరంపర లేమిటో. తన అదృష్టం ఏమీ బాగులేదు. ఆ కవిగారు, ను వ్వెక్కవలసిన రైలు జీవిత కాలం లేటని రాసిన కలంతోనే - నువ్వు పడి చావవలసిన రైలు జీవిత కాలం లేటు అని కూడా రాసేస్తే సరిపోయేది.

తనని తాను తిట్టుకుంటూ నీరసంగా నడవసాగా డతను మండుటెండలో... ఊరివేపు.

అతను తన వీథిలో... ఇంటివేపు మలుపు తిరగబోతూంటే... ఎదురుగా పోస్టుమన్ సైకిలు దిగి... "గోపాలంగారూ! మీకోసం మీ గదికి వెళ్తోన్నున్నాను. మీ కుత్తరా లున్నాయి" అంటూ సంచి తెరిచాడు.

చావబోయేవాడికి ఉత్తరాలతో ఏం పని అనుకుంటూనే - "రిజిస్టర్డ్... ఇక్కడ సంతకం చేయండి" అంటూ పోస్టుమన్ అందించిన కవ రందుకుని... సంతకం చేసి... కవరు చించి చదవడమేమిటి, గోపాలం ఒక్కసారి ఆనందం పట్టలేకపోయిన ట్లరిచాడు. "పోస్టుమాన్‌గారూ! నా కుద్యోగం వచ్చిందండీ. ఉద్యోగం సామాన్యంగా



వచ్చినది కాదండీ ఇది. లంచమూ, సిఫార్సూ, దొడ్డి తోవలూ, అడ్డతోవలూ అలాటి అవినీతు లేవీ లేకుండా నూటిగా, సహజంగా, స్వచ్ఛంగా వచ్చిన సుందరమైన ఉద్యోగమండీ. నా సంతోషం కొద్దీ ఇస్తున్న ఈ చిన్న బహుమతి తీసుకోండి" అంటూ జేబులోంచి డబ్బు తీసి దానిలోంచి ఓ అయిదు రూపాయల నోటందించబోయాడు.

"మీకు మామూలు ఉత్తరం కూడా ఉంది. అది కూడా చదివి చూసుకుని అప్పుడు రెండింటికీ కలిపి ఇద్దురు గాని. ఈ ఉత్తరంలోనూ ఏదేనా శుభవార్త ఉండవచ్చు. ఎందుకంటే, శుభాలయినా, అశుభాలయినా ఒంటిగా కాక జమిలిగా వస్తా యంటారు పెద్దలు" అంటూ ఓ కవ రందించాడు. గోపాలం ఆత్రంగా చదివేశాడు దానిని. "మీరు చెప్పినట్లు ఇది శుభవార్తే. రాధ! నేను ప్రేమించిన రాధ... నన్ను ప్రేమించిన రాధ... నన్నే పెళ్ళి చేసుకుంటుంది. ఇంకెవరినీ చేసుకోదు. వాళ్ళ నాన్నగారిని కూడా ఒప్పించింది. ఇదుగో ఈ పది రూపాయలూ ఉంచండి నా కానుకగా... స్వీట్లు తినండి."

"థాంక్యూ సర్. థాంక్యూ." నమస్కరించి వెళ్ళిపోయాడు పోస్టుమన్.

గోపాలం - గది చేరుకున్నాడు. ముఖం కడుక్కుని, బట్టలు మార్చుకుని మనిషిలా తయారై - ఆ రెండు ఉత్తరాలని మళ్ళీ చూసుకున్నాడు కళ్ళారా.

ఎప్పుడో ప్రయత్నించిన ఉద్యోగం... భగ్నమైపోయిందేమో అనుకున్న ప్రేమ... రెండూ ఫలించాయి. ఇక తను ఏవిధంగా చూసినా చనిపోనక్కరలేదు. ఈ రెం డుత్తరాలూ తన



## అద్దెకు

"అతను దొంగలాగా ఉన్నాడేవ్! ఆమె నాట్యం చేస్తుంటే ఆ నగలవైపు అలాగే గుడ్లప్పగించి చూస్తున్నాడు" గుసగుసలాడింది రమ ఉమ చెవిలో.

"దొంగని కాదమ్మా! ఆ నాట్యమయూరి భర్తను! ఆ నగలు అద్దెకు తెచ్చాను. ఎక్కడ విరిగి కింద పడితే వాటి ఖరీదు కట్టాల్సివస్తుందో అని ..."

కె.సి. బాబు [నెల్లూరు]

జీవితంలో విజయాలు. ఈ ప్రపంచం తను భయపడినంత కల్తీ, కల్మషం అయిపోలేదు, మనుషులని అవినీతీ పూర్తిగా ఆవరించలేదనీ, నీతి ఇంకా మిగిలి ఉందనీ రుజువు చేయడానికే తనకి ఉద్యోగం వచ్చింది. అలాగే... మనుషుల విలువ పడిపోలేదని నిరూపించడానికే రాధా వాళ్ళ నాన్నగారు తమ ప్రేమ నంగీకరించడం. ఇంతకంటే ఏం కావాలి తను జీవితంలో గెలుపు సాధించా డనడానికి?

తను తొందరపడి... అవివేకంగా ఆత్మహత్యా ప్రయత్నాలు చేసి చావడానికి తహ తహ లాడిపోయాడు కానీ...

అదీ ఒక విధంగా తప్పే. తన ఆశయాలకి గొడ్డలి పెట్టే. సహజంగా కాక, ఆత్మహత్య చేసుకుని మరణించబోవడం కూడా ఒక విధంగా జీవితాన్నీ మరణాన్నీ కల్తీ చేసుకోవడమే. ఆవేశంలోనూ, ఉద్రేకంలోనూ తను అపార్థం చేసుకున్నాడు కానీ, ప్రపంచంలో కల్తీ లేదు, కల్మషమూ లేదు. అందుకు సాక్ష్యం తన విజయమే.

ఈ విజయాన్ని తను పండగ జరుపుకోవాలి. సెలబ్రేట్ చేసుకోవాలి.

బట్టలు వేసుకుని, జేబులో చాలా డబ్బు పెట్టుకుని బయటకు బయలుదేరాడు గోపాలం.

అతను తిన్నగా ఓ నక్షత్రాల హొటల్ చేరుకున్నాడు.

స్వీట్లు... ఖరీదైన భోజనం... అతని కడుపు నిండిపోయింది కానీ, అతను హొటలు నుంచి ఇవతలకి వచ్చేసరికి...

కడుపులో తిప్పుతున్నట్లు...

కళ్ళు తిరుగుతున్నట్లు...

మరు నిముషం అతను స్పృహ కోల్పోయాడు. తరువాత ఏం జరిగిందీ అతనికి తెలియదు.

కొన్ని గంటల అనంతరం...

ఆ ఊరి ప్రభుత్వ ఆసుపత్రి.

గోపాలం మంచం చుట్టూ - డాక్టర్లు... నర్సులు... పోలీ సధికారులు.

డాక్టరు మెల్లగా చెబుతున్నాడు - "పేషెంట్ చనిపోయాడు. కారణం... విషాహారం. అంటే... అదే... ఆహారంలో కల్తీ..."

"అదేమిటి డాక్టర్? నేను విషం తింటేనే చావలేదు. ఆహారం తింటే చనిపోవడమా!" అని ఆశ్చర్యంగా అడగడానికి గోపాలం ఈ లోకంలో లేడు మరి! కాలుష్యమూ, కల్తీలూ లేని ఏదో లోకంలో ఉండి ఉంటాడు. ★

## సంక్రాంతి - శాంతి

'అంతేవాసి'

మెల్లగా మంచు తెరలు మా పల్లె నల్లె
చల్లగా వీచు గాలి కిల్లిల్లు వణకె.

★

చిమ్మ చీకట్లు విడకనే బొమ్మ లేచి
లక్ష్మి గుమ్మాల కడిగి, కళ్ళాపి జల్లె.

★

నిదురమత్తును కన్రెప్ప నదిమిపట్టి
మొగ్గకన్నెలు ముసుగేసి ముగ్గు లేసె
కూడి గుమ్మళ్ళ గొబ్బిళ్ళ కొలువు దిద్దె.

★

తూర్పు వాకిళ్ళు తెరచి తా తొంగి చూసి
మేటి గొబ్బిళ్ళ నిర్లేత మిద్దె నెక్కె.

★

బావ లల్లుళ్ళు దేశాల వార్త నుడువ
భోగి మంటల సభలందు ప్రొద్దు పొడచె.

★

చెమట చిందించి తల్లి పుడమిని కొలచి
గాదె నింపిన తాతయ్య కళ్ళు మెరిసె.

★

మంచు చినుకుల బంతి చేమంతు లూగె
క్రొత్త బట్టల పిల్లల కోర్కెదీరె.

★

వంటకమ్ముల ఘుమఘుమల్ మింటి కెగసి
నేలదిగిరాగ నోరూరి నింగి వారు
అన్నపూర్ణయై వంటింట అమ్మ తిరిగె.

★

పసుల చేయించి చుట్టాల పల్కరించి
అరుగు దిగి రాకనే నాన్న అలసిపోయె.

★

పసుపు కుంకుమల పూజ గోవత్సములకు
కొమ్ములకు రంగు వృషభరాజమ్ములకును
డూడూ బసవన్నకు కనవు, బేడ డబ్బు
ధాన్య హారతు లివె హరిదాసునకును.

★

వాడ వాడల నిండెను వేడుకమ్మ
పల్లె గొంతున విచ్చిన పాటలమ్మ
సందు సందున కేరింత జాడలమ్మ
పల్లె గుండెలో పట్టని పండుగమ్మ.

★

ఏవి ఆనాటి సంక్రాంతు లేవి ఏవి?
ఏవి ఆనాటి పల్లియ లేవి ఏవి?

★

వాడ వాడల వేర్పాటు వాద మెగసి
సందు సందున జండాల జాడ్య మెచ్చి
పల్లె గొంతుక, గుండె, రూపమ్ము మారె.

★

అయిననూ, ఒక ఆశ -
ఋతు చక్రవర్తి ఆ ఇనదేవు రాశి
మకరమ్ముగా వచ్చి మకర సంక్రాంతి.
భువనమ్ము నింపు శ్రీ భవనంపు కాంతి
పల్లె పట్నాలలో ప్రవహించు శాంతి !

★